క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. డాక్టర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎన్జీవోస్ కాలనీ -2, వెంకటేశ్వర కాలనీ, శ్యామల గార్డెన్, అమరావతి నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, భీమారం రోడ్డు, అరుణోదయ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, హనుమకొండ న్యూ బస్‌స్టేషన్ రోడ్డు, చౌరస్తా మెయిన్ రోడ్డు, టైలర్స్ స్ట్రీట్, గాంధీనగర్, కాకాజీ కాలనీ, కాంగ్రెస్ భవన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, ఫాతిమానగర్, అఫ్జల్‌నగర్, దర్గా ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, ఏఎస్‌రెడ్డి నగర్, మామునూరు మెయిన్ రోడ్డు, పోలీసు స్టేషన్, మామునూర్ విలేజ్, డైరీఫాం ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నవ్యశ్రీ ఎంపిక

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని నవ్యశ్రీ రాష్ట్రస్థాయి అండర్ -14 ఖోఖో పోటీలకు ఎంపికైంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వి.రామకృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ గోగు నారాయణ తెలిపారు. ఈమేరకు పాఠశాల ప్రాంగణంలో నవ్యశ్రీని హెచ్ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయుల ఆదివారం అభినందించారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

హసన్‌పర్తి: చింతగట్టు సమీపంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగ, మాదిగ ఉపకులాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

7న జాతీయ సెమినార్



వరంగల్ చౌరస్తా: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 7న జరగనున్న జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఎంసీపీఐ (యూ) నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో సెమినార్ వాల్‌పోస్టర్లను నాయకులు నర్ర ప్రతాప్, గోనె జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద ఫాసిస్టు కార్పొరేట్ శక్తుల ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడేది ఒక కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు. వామపక్షాలు ఏకం కావాలని, ఆ ఐక్యతే దేశానికి రక్షణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అయితం నగేష్, రాయినేని ఐలయ్య, నలుగుల రవి, దారా శివ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్‌గా కల్లూరి పవన్



హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా కల్లూరి పవన్‌ను నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్యార్మీ జెండా వేడుక

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లోని నానామియాతోట వద్ద ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నేతల ఆధ్వర్యంలో గ్యార్మీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరై గ్యార్మీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్‌మసూద్, కార్పొరేటర్ బస్వరాజు శ్రీమాన్, బస్వరాజు కుమారస్వామి, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం

- కాజీపేట కూరగాయల మార్కెట్‌లో గేట్ లేక ఇబ్బందులు
- పందులు, పశువుల సంచారం
- చోరీకి గురవుతున్న కూరగాయలు



కాజీపేటలోని విజయనగర్‌కాలనీ వైపు గేట్ పెట్టాల్సిన ప్రాంతం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ శ్రీవెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్‌లో ప్రహరీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో క్రయవిక్రయదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజక వర్గం అభివృద్ధి పథకం నిధులు (సీడీఎఫ్) నుంచి రూ.50 లక్షలకు పైగా మంజూరు చేసి ఐదేళ్ల క్రితం మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మించారు. కాంట్రాక్టర్ విజయనగర్ కాలనీవైపు గేట్ పెట్టకుండా వదిలేయడమే సమస్యగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు.

అనేకసార్లు విన్నవించినా..

గేట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ కూరగాయల వ్యాపారులు అనేకమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకుల చొరవ ఫలితంగా మార్కెట్‌లో చిరు వ్యాపారులకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ పలు అభివృద్ధి పనులను చేపట్టి పూర్తిచేశారు. అయితే మార్కెట్‌కు వెనుక భాగం ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేసిన అధికారులు.. గేట్ పెట్టడానికి చేసిన ప్రయత్నాలను కొంతమంది స్థానికులు అడ్డుకున్నారు. ఇదీ వ్యాపారులు, సమీప కాలనీవాసులకు మధ్య వివాదంగా మారడమేగాక సమస్య తీవ్రమై చిలికి చిలికి గాలివానగా మారింది.

పందులు, పశువుల సంచారం

పుష్కర కాలం క్రితం ప్రభుత్వ స్థలంలో ప్రారంభమైన కూరగాయల మార్కెట్ చుట్టూ ప్రహరీ ఉన్నా.. విజయనగర్‌కాలనీ వైపు గేట్ లేకపోవడంతో పశువులు, పందులు, వాహనాలు మార్కెట్‌లో యథేచ్ఛగా సంచరిస్తూ వ్యాపారులు, కొనుగోలుదారులకు ప్రాణసంకటంగా మారుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. కాలనీ వైపు గేట్ పెట్టాల్సిందేనని వ్యాపారులు, తమకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ కాలనీవాసులు భీష్మించుకుని కూర్చోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చాలాకాలం తర్వాత మార్కెట్‌కు మంచి రోజులు వచ్చాయని భావిస్తున్న తరుణంలో గేట్ పెట్టనీయకపోవడం ఎంతవరకు సమంజసం అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

కూరగాయల అపహరణ

మార్కెట్‌కు ఒకవైపు గేట్‌లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ఆకతాయిలు ప్రవేశించి మద్యం తాగడం, దొంగలు కూరగాయలను ఎత్తుకెళ్తున్నారని చిరువ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయినందునా అధికారులు ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వెంటనే గేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



ధాత్రినారాయణ పూజలు చేస్తున్న మహిళలు



సహపంక్తి భోజనాలు చేస్తున్న భక్తులు

వరంగల్: కార్తీకమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని ఏనుమాముల మార్కెట్ ఆవరణలో శ్రీలక్ష్మీశ్రీనివాస్ కాటన్ ఇండస్ట్రీలో వజనపెల్లి సుమంగళి నేతృత్వంలోని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులో శ్రీధాత్రి నారాయణ పూజలు నిర్వహించి తులసి మొక్క వద్ద ఉసిరి దీపాలను ఏర్పాటు చేసి దీపారాధన చేశారు. గోదావరి జలంతో అరటి ఆకులను శుద్ధి చేసి ఉసిరి దీపాలను పెట్టి మహిళలంతా కలిసి పాటలు పాడి అలరించారు. అనంతరం ఉసిరి చెట్టు వద్దకు వెళ్లి సామూహికంగా సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బిందు, శరణ్య, మాధవి, వాసవీదేవి, రాణి, సునీత, వేణు, శ్రీదేవి, తేజ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో సహపంక్తి భోజనాలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అన్నపూర్ణ భవనంలో ఆదివారం భగిని హస్త భోజనం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భగిని హస్త భోజనం పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎల్.రవి, దుర్గం సుధీర్, పాక పవన్, గంగుల రాజిరెడ్డి, తుమ్మ శ్రీనివాస్, ఉమారాణి, కల్పన, సుజాత, రజిత తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడు చూపిన మార్గంలో నడుద్దాం



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ: మహాత్మా గాంధీ చూపిన మార్గంలో నడుద్దామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ గాంధీనగర్ కూడలిలో ఆదివారం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ చూపిన సన్మార్గంలో నడుస్తూ భావితరానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. కాలనీవాసులు సంఘటితంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రశంసించారు. గాంధీనగర్‌లో మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఈవీ శ్రీనివాస రావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్, డివిజన్ అధ్యక్షుడు సతీష్, గాంధీనగర్ కాలనీ కమిటీ బాధ్యులు అశోక్, వీరేందర్, కనకయ్య, ఆకుల శ్యాంప్రసాద్, వడ్లకొండ నరేందర్, మల్లారెడ్డి, అశోక్ రెడ్డి, రాజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణ, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



న్యూశాయంపేట: ఉపాధి కోసం నిరుద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్ సుందరయ్య భవన్‌లో డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆదివారం ఎగురవేసి కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, చిరంజీవి, మౌనిక, భానునాయక్, కే.కుమార్, జే.కుమార్, మహేష్, రాజు, అరవింద్, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

కాజీపేట: కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను కాజీపేట మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో భర్తీ చేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. సమావేశంలో జంపాల రమేష్, మదన్‌చారి, శివరాత్రి కరుణాకర్, యువన్, శ్రీను, హరీష్, యేసు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గణనను పారదర్శకంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్

హన్మకొండ: బీసీ కుల, సామాజిక, ఆర్థిక గణనను సమర్థవంతంగా నిర్వహించాలని మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జగన్మోహన్ ముదిరాజ్ సూచించారు. హనుమకొండలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా బీసీ కులాల ప్రజలు వెనుకబడి ఉన్నారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేయాలనే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర జనాభాలో సుమారు 13శాతంగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇప్పటికీ అన్యాయమే జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ విద్య ఉద్యోగాల్లో, ఉపాధి అవకాశాల్లో ముదిరాజ్ బిడ్డలు ముందువరుసలో ఉండాలన్నారు. సమావేశంలో మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, ఈరబోయిన వినోద్, పోలు శ్రీనివాస్, దండు చిరంజీవి, చిరుత వెంకటేశ్వర్లు, పెండ్యాల కృష్ణ, నూనె శివ, కొలిమి ప్రభాకర్, బోయిని సత్యనారాయణ, వేణుగోపాల్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో సీఎం రేవంత్ సర్కార్ ప్రతీకార పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 11 నెలలవుతున్నా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఈసంపల్లి సంజీవ, మడికొండ బాబు, ఆటో యూనియన్ల నాయకులు జయరాం, నబీ, రాంచందర్, నర్సింగ్, నరహరి, కుమారస్వామి, రమేష్, వెంకటస్వామి, సాయిలు, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే సంస్థ లక్ష్యం



మదర్సా విద్యార్థులతో సంస్థ బాధ్యులు

న్యూశాయంపేట: పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్‌కలీం తెలిపారు. వరంగల్ నగరంలోని జమతుల్ సుఫా, అరబ్బియా సిరాజుల్ ఉలూం, మదీనతుల్ ఉలూం, బాబులుల్ ఉలూం, జమైతుల్ సుఫియాన్ మదర్సాల్లో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని మదర్సాలో అరబ్బీ విద్యనభ్యసిస్తున్న 500 మంది విద్యార్థులకు రెండు జతల డ్రెస్‌లు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిరాజ్ అహ్మద్, నాజనీస్ వాహిదీ, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమిని కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్‌లోని కాశీ విశ్వేశ్వర రంగనాథస్వామి దేవాలయ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కాశీ విశ్వేశ్వర, రంగనాథ ఆలయాల పరిరక్షణ, డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. ఈమేరకు కాశిబుగ్గలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయానికి చెందిన 28 గుంటల భూమి అన్యాక్రాంతం కాగా, కబ్జాదారులపై కోర్టులో కేసు వేసి గెలుపొందినట్లు తెలిపారు. అంతటితో ఆ కబ్జాదారులు ఆగకుండా మరలా ఆ భూమిపై హైకోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు. ఆలయాల పరిరక్షణ సొసైటీ ఆధ్వర్యంలో హైకోర్టులో మరలా పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి ఆ భూమిని కాపాడుకుందామని సమావేశంలో తీర్మానించుకున్నట్లు వివరించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, దయాకర్, రాజ్‌కుమార్, సాంబయ్య, లక్ష్మీనారాయణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు వరంగల్‌కు శ్రీరామ యంత్ర రథయాత్ర

హన్మకొండ కల్చరల్: అయోధ్య రామ మందిరంలో శాశ్వత ప్రతిష్ఠ చేయడానికి 108 కిలోల బంగారంతో తయారుచేసిన శ్రీరామ మహాయంత్ర రథయాత్ర వరంగల్‌కు సోమవారం చేరుకోనుంది. హైదరాబాద్ నుంచి ఉదయం 10గంటలకు హనుమకొండ వేయిస్తంభాల దేవాలయానికి చేరుకొని అక్కడ పూజలు అనంతరం 11.30గంటలకు వరంగల్ రాజరాజేశ్వర దేవాలయానికి చేరుకుంటుంది.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు హనుమకొండ శ్రీనగర్ కాలనీ (సౌత్) అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు మందల రవీందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ శ్రీనగర్ కాలనీలో కాలనీ అభివృద్ధి సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా పరిష్కరించినట్లు వివరించారు. గత రెండు సంవత్సరాల్లో సొసైటీ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏడిద అనిల్‌కుమార్, ప్రధాన సలహాదారుడిగా బండి నారాయణ, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి, మాలకొండా రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ముత్యాల కుమారస్వామి, వీరభద్రయ్య, ఆర్థిక కార్యదర్శిగా హింగె మనోహర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా ముక్యాల రాహుల్, డి.రాజ్‌కుమార్, జి.నరేందర్, ఎం.చంద్రమౌళి, బి.ప్రసాద్, వై.నరేందర్, ఎ.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో కమిటీ సభ్యుల సందెల సత్యనారాయణ, కాసర్ల సురేందర్ రెడ్డి, సాయిని వెంకటేశ్వర్లు, ఎం.వీరయ్య, పి.సూర్య కుమార్, రామ్మోహన్ రెడ్డి, ఎం.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో నరకాసుర వధ విజయవంతం

ఖిలా వరంగల్: అధికారులు, దాతల సమష్టి సహకారంతో వరంగల్ ఉర్సుగుట్ట మైదానంలో గత నెల 30న జరిగిన నరకాసుర వధ కార్యక్రమం విజయవంతమైందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీపీ అంబర్ కిషోర్ ఝూ, అన్ని శాఖల అధికారుల సహకారంతో నరకాసుర వధ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

'కాకతీయ మహానంది' అవార్డు ప్రదానం



హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని సుజాత పాఠశాల కాకతీయ మహానంది – 2024 అవార్డుకు ఎంపికైంది. ఈమేరకు హనుమకొండలోని నేరేళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు అందుకున్నారు. అంజలి మీడియా ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో కృషిచేస్తున్న మహనీయులకు కాకతీయ మహానంది అవార్డు ప్రదానం చేస్తారు. 30ఏళ్లుగా వినాయక మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న సుజాత పాఠశాలకు ఈ అవకాశం దక్కింది. అంజలి ఫౌండేషన్ చైర్మన్ కామిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

డిసెంబర్‌లో రైల్వే యూనియన్ ఎన్నికలు

కాజీపేట రూరల్: డిసెంబర్ 4, 5వ తేదీల్లో రైల్వేలో వన్ యూనియన్ వన్ ఇండస్ట్రీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికలో కార్మికులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌షెడ్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే.జానీ, పి.వేదప్రకాష్ సూచించారు. ఈమేరకు కాజీపేట డీజిల్ లోకోషెడ్ కాకతీయ కళావేదికపై ఎన్నికల వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో 8వ పే కమిషన్, 18 నెలల డీఏ, ఎరియర్స్, పాత బకాయిలు చెల్లించాలని కోరారు. రైల్వేలో ప్రైవేటీకరణపై పోరాటం చేయాలని తెలిపారు. కార్మికులు మజ్దూర్ యూనియన్ జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ నాయకులు జి.రాజేశ్వర్ రావు, యాదగిరి, నరేష్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, గుర్రం నాగరాజు, ఐలయ్య, దేవేందర్, సాయిలు, లకన్‌సింగ్, కార్మికులు పాల్గొన్నారు.

పరపతి సంఘం కార్తీకమాస వన భోజనాలు



రామన్నపేట: వాసవీమాత ఎంజీ రోడ్డు పరపతి సంఘం సభ్యుల కార్తీక మాస వన భోజనాల వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ భద్రకాళి దేవస్థాన సమీపంలోని భద్రి తటాకాంజనేయ శివపంచాయతన దేవాలయంలో పదేళ్ల కాలంలో సంఘం ప్రస్థానం గురించి సంఘం నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం మహిళలు, పిల్లలకు భగవద్గీత గురించి వివరించారు. ఉసిరి చెట్టు కింద మహిళలు ప్రత్యేక పూజలు చేసి గౌరమ్మకు మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, అకినపల్లి సత్యనారాయణ, రజనీకాంత్, రమేష్, వీరభద్రయ్య, తోట నవీన్, పెద్ది ప్రభాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. హనుమకొండ హసన్‌పర్తి గ్రామానికి చెందిన నారగోని స్వర్ణలత, ఉపేందర్ దంపతుల కుమారుడు నారగోని దీపక్ (22) అక్టోబర్ 16న మధ్యాహ్నం బైక్‌పై మధ్యకోటలోని నాన్నమ్మ ఇంటిలోని ఫంక్షన్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో మధ్యకోట శిల్పాల తోరణం సమీపంలోని మూలములపు వద్దకు బైక్ చేరుకోగానే ఒక్కసారి బైక్ అదుపు తప్పి చెట్టును బైక్ ఢీకొనడంతో దీపక్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు నారగోని శశికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి చొరవ చూపండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి చొరవ చూపాలని కాకతీయ స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేఅండ్‌ప్లే పద్ధతిలో క్రీడాకారుల నుంచి వసూలు చేస్తున్న ఫీజు లక్షల రూపాయలు ఉన్నప్పటికీ కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. పూల్‌లో నీటి శుద్ధీకరణ సరిగా లేకపోవడంతో క్రీడాకారులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. మెయిన్ గేట్ వద్ద నీరు నిలిచి బురద పేరుకుపోతోందని, పరిసర ప్రాంతాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేక శ్రద్ధ చూపి స్విమ్మింగ్ పూల్‌ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌సింగ్ ఠాకూర్, బాధ్యులు కృష్ణమాచారి, ప్రభాకర్, సునీల్ రెడ్డి, బద్రీనాథ్, తదితరులు ఉన్నారు.

డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం



సంబురాలు చేసుకుంటున్న గురుకుల విద్యార్థినులు

హసన్‌పర్తి: తెలంగాణ గిరిజన గురుకులాల్లో చదివే విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు 40శాతం పెంచడంపై విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు దేవన్నపేటలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నాను జయప్రదం చేయాలి



ఖిలా వరంగల్: ఈనెల 5న హైదరాబాద్‌లో జరగనున్న ఆటో డ్రైవర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్ల జేఏసీ పిలుపులో భాగంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఆటో యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న హైదరాబాద్‌లో నిర్వహించే ఆటో డ్రైవర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, అక్బర్, యాకూబ్, శ్రీనివాస్, బద్రి, రంజిత్, అనిల్, రవీందర్, వెంకటాద్రి పాల్గొన్నారు.